ప్రజాశక్తి
సోమవారం 4 మార్చి 2024 5
శ్రీ సత్యసాయి





చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డిఆర్ఒ కొండయ్య

పోలియోను సమూలంగా నిర్మూలిద్దాం


ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పోలియో మహమ్మారిని సమూలంగా పాలదోలదామని డిఆర్ఒ కొండయ్య పేర్కొన్నారు. పుట్టపర్తి ప్రశాంతి గ్రామ్ 9వ సచివాలయంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని డిఆర్ఒ కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి కె.కొండయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఎస్వీ కృష్ణారెడ్డి, వైద్యాధికారులు పలువురు పిల్లలకు పోలియో చుక్కలను వేశారు. అనంతరం డిఆర్ఒ మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించి పోలియో మహమ్మారిని తరిమివేయాలని కోరారు. జిల్లాలో 209015 మంది 5 సంవత్సరాల లోపు పిల్లలకు 1915 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని , 760 మంది సిబ్బంది ద్వారా 34 రూట్లలో 62 జన సమూహ ప్రాంతాలలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిఆర్ఒ తెలిపారు. ఏదైనా కారణం చేత పోలియో చుక్కలు వేయించుకొని పిల్లలకు ఈనెల 4, 5 మరియు 6 వ తేదీలలో ఇంటింటికీ వైద్యబృందాలు తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా అగ్రి బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు 'రా.. కదలిరా...'

◆ పెనుకొండలో చంద్రబాబు పర్యటన ◆ సభ ఏర్పాట్లలో నాయకులు

◆ విజయవంతానికి జనసమీకరణ ◆ అసంతృప్త నేతలను గాడిలో పెట్టేరా .?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చేపట్టిన 'రా కదలిరా' కార్యక్రమం నేటితో ముగియనుంది. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో జరిగే ఈ సభకు ఆ పార్టీ శ్రేణులు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నాయి. ముందుగా రాప్తాడు నియోజకవర్గంలో ఈ సభను ఏర్పాటు చేయాలనుకున్నప్పటికీ చివరి నిమిషంలో మార్పు చేశారు. ప్రస్తుతం పెనుకొండలో ఏర్పాటు చేశారు. రా కదలిరా సభ అంతకు మునుపు అనంతపురం జిల్లా ఉరవకొండలో ఏర్పాటు చేశారు. ఆశించినంత మేరకు జన సేకరణ చేపట్టి సభను విజయవంతం చేశారు. ఇదే నేపథ్యంలో వైసిపి ఫిబ్రవరి 18వ తేదీన సిద్ధం సభను రాప్తాడులో ఏర్పాటు చేసింది. రాయలసీమస్థాయి సభకు లక్షలాది మంది జనసమీకరణ చేపట్టి బలప్రదర్శన చేసింది. ఈ సభ జరిగిన చోటనే రాప్తాడులో రా కదలిరా సభను నిర్వహించాలని మొదట టిడిపి భావించింది. అయితే చివరి నిమిషంలో మార్పు చేసి పెనుకొండకు మార్చింది. కియా సమీపంలో ఈ సభకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు చంద్రబాబునాయుడు పెనుకొండకు రానున్నారు. సాయంత్రం ఐదున్నర గంటలకు సభ పూర్తవనుంది. ఈ సభను విజయవంతం చేయడానికి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి జనసమీకరణ చేపట్టే ఏర్పాట్లలో పార్టీ నేతలున్నారు. ఈ సభతో రా కదలిరా కార్యక్రమాన్ని ముగించి ప్రజాగళం పేరుతోకార్యక్రమాలను రూపొందించేందుకు పార్టీ సిద్ధమైంది. ఆఖరు సభ కాబట్టి పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని టిడిపి భావిస్తోంది.

అసంతృప్తులను గాడిలో పెట్టేరా ?

టిడిపి జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు ఈ పర్యటన సందర్భంగానైనా అసంతృప్తులను గాడిలో పెడతారా అన్న చర్చ నడుస్తోంది. ఇటీవలనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ తొమ్మిది నియోజకవర్గాల్లో అభ్యర్థులను టిడిపి ఖరారు చేసింది. ఇందులో అనేక చోట్ల అసంతృప్తులున్నాయి. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు పర్యటించే పెనుకొండలోనే సత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి వర్గీయులు అసంతృప్తితో ఉన్నారు. ఆయనకు కాకుండా సవితకు టిక్కెట్టు ఇచ్చారని ఒక గ్రూపు అలకబూనింది. అదే విధంగా కళ్యాణదుర్గం, శింగనమల, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనూ అసంతృప్తులున్నాయి. ఈనేపథ్యంలో ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో చంద్రబాబు వీటన్నింటిపై నేతలతో చర్చిస్తారా లేక కార్యక్రమం ఒక్కటికే పరిమితమవుతారా అన్న చర్చ నడుస్తోంది. అభ్యర్థుల ప్రకటన వెలువడిన వెంటనే అసంతృప్త నేతలతో ఆయన మాట్లాడినట్లు తెలుస్తోంది. అయితే ఎన్నికల్లో వీరి ఏ మేరకు సహకరిస్తారన్న సందేహాలు మాత్రం అభ్యర్థుల్లోనూ ఉన్నాయి. అదే విధంగా ఎన్నికలు సమీస్తుండటంతో పార్టీ శ్రేణులకు ఏ రకంగా మార్గనిర్దేశం చేస్తారోనని ఆపార్టీ నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపికి కంచుకోట లాంటిది. అటువంటిది గత ఎన్నికల్లో ఘోరంగా పరాయజయాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో తిరిగి పార్టీ పుంజుకోవడానికి ఎటువంటి మార్గదర్శకాన్ని సూచిస్తారోనని ఆ పార్టీ నేతలు ఎదురు చూస్తున్నారు.



సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సవితమ్మ, టిడిపి నాయకులు



నిరుపేదలతో మాట్లాడుతున్న సిపిఎం, కెవిపిఎస్ నాయకులు

ఇళ్ల స్థలాల కోసం భూపోరాటాలకు సిద్ధం

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపాలిటీలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం భూ పోరాటాలకైనా సిద్ధమని సిపిఎం జిల్లా నాయకులు పెద్దన్న స్పష్టం చేశారు. ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలతో పట్టణంలోని ఇందిరా పార్కులో సమావేశం నిర్వహించారు. పెద్దన్న, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈ నెల 6వ తేదీ లోపు ఇంటి స్థలాలు కేటాయించాలని, లేనిచో 7వ తేదీ సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భూ పోరాటం చేసి పేదలకు తామే ఇంటి స్థలాలు పంచుతామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నసీం తాజ్, జ్యోతమ్మ, నారాయణ, లక్ష్మీదేవి, సరస్వతమ్మ, నీలమ్మ, శశికళ, రామాంజి, రెడ్డమ్మ, నాజియా, రేష్మ, తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంతో నీటి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళదాం

సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్

పెనుకొండలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జలకవనం



సమావేశంలో మాట్లాడుతున్న సడ్లపల్లి చిదంబరరెడ్డి

ప్రజాశక్తి -పెనుకొండ

రాయలసీమ జిల్లాలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను సాహిత్యం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళదామని సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ పిలుపునిచ్చారు. పెనుకొండ పట్టణంలోని గగన్ మహల్ ఆవరణంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం జలకవనం నిర్వహించారు. సాహితీస్రవంతి జిల్లా కన్వీనర్ ఏ. హరి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయలసీమ జలసాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశ రథ రామిరెడ్డి, సాహితీ స్రవంతి రాష్ట్ర ఆధ్యక్షులు కెంగార మోహన్, ఏలూరి యంగన్న, సడ్లపల్లి చిదంబర రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో దశాబ్దాలుగా నీటి సమస్య ఉందన్నారు. వర్షపాతం తక్కువగా ఉన్న ఈ జిల్లాల్లో నీటి సమస్యల పరిష్కారంలో పాలకులలో చిత్తశుద్ధి లేకపోవడంతో సమస్య జఠిలమైందన్నారు. ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయకపోవడం, వర్షపు నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం లేకపోవడం వలన నీటి ఎద్దడి రోజు రోజుకు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జలకవనంలో జరిగే సాహిత్యం ద్వారా నీటి సమస్యలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వాల కళ్లు తెరిచే విధంగా కవితలు, పద్యాలు, పాటలు ఉండాలన్నారు. కవులు, రచయితల పాటలు, పద్యాలు, కవితలు రాయలసీమ ఎదుర్కొంటున్న నీటి కరువు గురించి కారణాలు ఏమిటో ప్రతిబింబించాలన్నారు. రాయలసీమకు అడుగుతున్న నీటి హక్కులు ప్రాంతీయ తత్వం కాదన్నారు. రాయలసీమ నీటి సంక్షోభం సాహిత్య ప్రభావాన్ని గురించి సడ్లపల్లి, మోహన్ ఈసందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమం లో రాయలసీమ జిల్లాలనుంచి వచ్చిన కవులు, గాయకులు తమ కవితలను, పద్యాలను, పాటలను వినిపించారు. అనంతరం నిర్వాహకులు కవులకు, గాయకులకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి కవులు, కళాకారులు, సాహితీ స్రవంతి సభ్యులు రాజశేఖర్, కోగిర జయచంద్ర, రామన్న, యుటిఎఫ్ నాయకులు సుధాకర్, నారాయణ స్వామి, రమేష్, మేధావులు, ప్రముఖులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కాన్సర్ వైద్యశిబిరాలు

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

బసవతారక ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కాన్సర్ మొబైల్ వైద్యశిబిరాలు నిర్వహిస్తామని స్థానిక ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. హిందూపురంలోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని బాలకృష్ణ ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి మరణాంతరం ఆమె జ్ఞాపకార్థకంగా బసవతారక ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ను తన తండ్రి నందమూరి తారక రామరావు స్థాపించారన్నారు. తన తండ్రి స్ఫూర్తితో క్యాన్సర్ హాస్పిటల్ నిర్వహిస్తు, ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నామని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక పరికరాలతో కూడిన మొబైల్ వాహనాన్ని తయారు చేయడం జరిగిందన్నారు. నూతన ఉచిత మొబైల్ క్యాన్సర్ నిర్ధారణ వాహనాన్ని హిందూపురం నుంచే ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పేదవారికి తమ ఆసుపత్రిలో ఉచిత సేవలు అందించడంతో పాటు రాయితీతో కూడిన వైద్య సేవలందిస్తామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు ముందుకు వస్తే రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే హిందూపురం నియోజక వర్గంలో గత సంవత్సరం నుండి ఎన్టీఆర్ మొబైల్ చైతన్య రథం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తున్నామన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య రథం నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి వైద్య సేవలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు సుధాకర్, శ్రావణి కుమారి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్. సురేంద్ర, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, అంబికా లక్ష్మీనారాయణ, రమేష్ కుమార్ తో పాటు టిడిపి నాయకులు, వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం'



31వ వార్డులో మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రజలను మోసగించిన సిఎం జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నియోజకవర్గ టిడిపి పరిశీలకులు నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ పేర్కొన్నారు. 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా ఆదివారం వారు పట్టణంలోని 31వ వార్డులో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టో పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి రాజ్యం, ధర్మవరంలో పాలేగాళ్ల రాజ్యం నడుస్తోందని విమర్శించారు. జగన్ అండ్ కో రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్ మార్చారన్నారు. ప్రజలు టిడిపికి ఓటు వేసి చంద్రబాబును సిఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ధర్మవరంలో పరిటాల శ్రీరామ్‌ను ఎమ్మెల్యే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, శీలామూర్తి, రాళ్లపల్లి షరీఫ్, అంబటి సనత్, కరెంటు ఆది, గంగారపు రవి, గోసల శ్రీరాములు, మారుతిస్వామి, మాధవరెడ్డి, అత్తార్ రహీంబాషా, ఉస్మాన్, బీరే శీన, గోపాల్, అశ్వర్థనారాయణ, నాగేంద్ర, తొగట అనిల్, బాబావలి పాల్గొన్నారు

టిడిపికి పూర్వవైభవం తెద్దాం


టిడిపి నియోజకవర్గ పరిశీలకులు

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి అధినేత చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యమని, సమిష్టిగా పని చేసి మడకశిర ఎమ్మెల్యేగా సునీల్‌కుమార్‌ను గెలిపిస్తామని టిడిపి నాయకులు స్పష్టం చేశారు. పెనుకొండ మండలంలోని కియా కంపెనీ ఎదుట సోమవారం నిర్వహిస్తున్న 'రా.. కదలిరా..' బహిరంగ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ పరిశీలకులు గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణ సమీపంలోని శివాలయం ఆవరణలో ఆదివారం గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టిడిపి అభ్యర్థి సునీల్‌కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ అధినేత చంద్రబాబు టిడిపి అభ్యర్థిగా డాక్టర్ సునీల్‌కుమార్‌కు గౌరవం ఇచ్చారు. ఆ గౌరవాన్ని మనందరి బాధ్యతగా తీసుకొని అత్యధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. రాక్షస పాలన నుంచి విముక్తి పొందాలంటే టిడిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. సమావేశంలో నాయకులు మాధవరాజు, ఓబులేశప్ప, విఎం.పాండురంగప్ప, రవిభూషణ్, ఉగ్రనరసింహప్ప, ఆదినారాయణ, అశ్వర్థామప్ప, జాస్కో రామయ్య, సుబ్బరాయుడు, సన్నీరప్ప, పుల్లయ్యచౌదరి, రంగనాథ్, టిడిఇ పల్లి మంజునాథ్, నరేష్, రాజగోపాల్, క్రిష్టప్ప, రమేష్, కేశవరెడ్డి, నాగరాజు, కార్యకర్తలు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతిగృహాలకు మహర్దశ

సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివరంగప్రసాద్



ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లాలో ఉన్న 26 సాంఘిక సంక్షేమ హాస్టళ్ల రూపు రేఖలు మారనున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివ రంగ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తికి ఆదివారం ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను నాడు నేడు కింద ఏ విధంగా అభివద్ధి చేశారో అదేవిధంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్ల రూపురేఖలను మార్చమన్నారని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఇంటర్నెట్, టీవీ సౌకర్యాలు తదితర అంశాలను చర్చించి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

ప్రశ్న :శ్రీ సత్య సాయి జిల్లాలో ఎన్ని హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఎన్ని?

జవాబు: శ్రీ సత్యసాయి జిల్లావ్యాప్తంగా 26 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో మూడు నుండి పదవ తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన హాస్టల్లో బాలురకు 12, బాలికలకు 5 ఉన్నాయి. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఇంటర్మీడియట్ చదివే బాలికలకు 5, బాలురకు 4 ఉన్నాయి.

ప్ర: విద్యార్థులకు కాస్మటిక్ చార్జీలు సరిగా అందజేస్తున్నారా.?

జ: గతంలో మాదిరి కాకుండా విద్యార్థులకు నెలనెలా ఇవ్వాల్సిన కాస్మోటిక్ ఛార్జీలను వారి తల్లుల ఖాతాలో జమ చేస్తున్నాం. మెస్ చార్జీల విషయానికి వస్తే గతంలో ఉన్న చార్జీలు ఇప్పుడు అమలవుతున్నాయి వాటి వల్ల ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనం అందించలేక ఇబ్బందులు పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లాం.

ప్ర : హాస్టల్ సిబ్బందికి బయోమెట్రిక్ విధానం అమలులో ఉందా.?

జ : హాస్టల్ సిబ్బంది బయోమెట్రిక్ విధానాన్ని అవలంభిస్తున్నారు. దాని ద్వారా ఏ అధికారి విధులు హాజరు కాలేదో వెంటనే ఉన్నతాధికారి దృష్టికి వెళ్తుంది. ఈ తరుణంలో సిబ్బంది హాజరు పై సంజాయిషీ ఇవ్వాల్సి వస్తుంది ఈ విధానంతో సిబ్బంది వందశాతం విధులకు హాజరవుతున్నారు.

ప్ర : అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు ఎప్పుడు మంజూరు చేస్తారు?

జ : సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పరిధిలో రెండు రకాల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మూడు నుండి పదవ తరగతి వరకు ఉన్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఆప్కార్డు నుండి నెల నెల వేతనాలు అందుతున్నాయి. జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి మదర్‌థెరిస్సా ట్రస్టు నుండి వేతనాలు అందాల్సి ఉంది ప్రభుత్వం గ్రాంటు మంజూరు చేస్తే మదర్‌థెరిస్సా ట్రస్టు బదలాయింపు చేసి వారికి వేతనాలు మంజూరు చేస్తారు.

ప్ర : హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏవి.?

జ : హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతోంది ప్రధానంగా అద్దె భవనాల్లో ఉన్న వసతి గృహాలపై దృష్టి పెట్టింది. వాటికి నాడు నేడు పథకం కింద శాశ్వత భవనాలను నిర్మించి హాస్టలను ఉత్తమ స్థాయిలో తీర్చిదిద్దాలని తృకృథంతో ప్రభుత్వం ఉంది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సౌకర్యంతమైన ఆశ్రయం ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందించడానికి అన్ని చర్యలు చేపడుతుంది. హాస్టళ్ల పని తీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణతో విద్యార్థుల హాజరు, వారికి నాణ్యమైన భోజనం అందుతుందా లేదా అనే అంశాలను వారు పరిశీలించి అప్పటికప్పుడు తీసుకురావడంతో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం.



మహిళాపక్షపాతి వైసిపి : మంత్రి పెద్దిరెడ్డి



కదిరిలో లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మహిళా పక్షపాతి ప్రభుత్వమని వైసిపి రీజినల్ కోర్డినేటర్ రీజినల్ కోఆర్డినేటర్, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం కదిరి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన కారక్రమాల్లో కదిరి వైసీపీ సమన్వయ కర్త మక్బూల్, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మతోపాటు పాల్గొని లబ్ధిదారులకు వైఎస్ఆర్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు రాష్ట్రంలో మహిళల అభివృద్ధి కోసం పాటుపడిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మాజీ కార్యదర్శి వజ్రభాస్కర్ రెడ్డి, మాజీ సమన్వయకర్త ఎస్ఎండి ఇస్మాయిల్, వైసిపి నాయకులు సాదత్ అలీ ఖాన్, పరికి సాధిక్ భాష, బత్తల వెంకటరమణ, బత్తల హరిప్రసాద్, లింగాల లోకేశ్వర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసిపి పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ , కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బిఎస్ మక్బుల్‌బాషా పాల్గొని లబ్ధిదారులకు వైఎస్ఆర్ ఆసరా మెగా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసిన ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ జి రవీంద్రారెడ్డి జేసీఎస్ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి భాస్కర్, సింగల్ విండో అధ్యక్షులు ఎస్ పి హైదర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : నల్లచెరువు మండలంలో ఆదివారం నిర్వహించిన వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మహిళాభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 600 దొంగ హామీలు ఇచ్చి ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎవైసిపి మండల కన్వీనర్ హైదర్ వలీ, జడ్పిటిసి అనితమ్మ, సర్పంచులు, ఎంపిటీసీలు, నాయకులు కార్యకర్తలు, మహిళలు, పాల్గొన్నారు.

తలుపుల : మహిళా సాధికారత కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆదరిద్దామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళాభివృద్ధే వైసిపి ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్ డీకే బాబు ఫయాజ్ ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మహిళా సాధికారత కోసం నిరంతరం శ్రమిస్తున్న సిఎం జగన్‌ను మరోమారు సిఎం చేసుకుందామని మంత్రి పెద్దిరెడ్డి పిలుపునిచ్చారు. హిందూపురం పార్లమెంటు, కదిరి నియోజకవర్గ సమన్వయ కర్తలు బోయ శాంతమ్మ, బిఎస్.మక్బుల్‌బాషాలతో కలిసి మంత్రి లబ్ధిదారులకు వైఎస్ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల అభివృద్ధి కోసం పాటుపడిన ఏకైక సిఎం జగన్ అన్నారు.

ప్రతి ఓటరూ ఓటు వేసేలా చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతి పోలింగ్ బూత్‌లో తగిన చర్యలు చేపడతామని ఆర్‌డిఒ, నియోజకవర్గ ఎన్నికల అధికారి వెంకటశివరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఆదివారం ఆయన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల విషయంపై సమావేశం నిర్వహించారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా రాజకీయ పార్టీల నాయకులందరూ సహాయ, సహకారాలు అందిస్తూ ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. బిఎల్‌ఒలు, సూపర్వైజర్ల ద్వారా పారదర్శకతతో కూడిన ఓటరు జాబితా తయారు చేశామన్నారు. పోలింగ్ బూత్ కేంద్రాలు శిథిలావస్థలో ఉంటే మరొక బిల్డింగ్‌కు మారుస్తామన్నారు. తాడిమర్రి మండలం పెద్దకోట, ముదిగుబ్బ మండలం రామస్వామి తండా, బత్తలపల్లి మండలం అనంతసాగరం, ధర్మవరం మండలం తుంపర్తి గ్రామాలను లొకేషన్ మార్పులుగా గుర్తించామన్నారు. నియోజకవర్గంలో 5 పోలింగ్ బూత్‌ల పేర్లను మార్చామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సమస్యలను రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తగా వాటిని పరిష్కరిస్తామని ఆర్‌డిఒ తెలిపారు. సమావేశంలో వైసిపి, టిడిపి, బిజెపి, కాంగ్రెస్, జనసేనపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



తిరుమలలో శ్రీవారిని దర్శనం చేసుకున్న టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ దంపతులు

శ్రీవారిని దర్శించుకున్న 'కందికుంట' దంపతులు

కదిరి టౌన్ : నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ దంపతులు ఆదివారం తిరుమలలో విఐపి బ్రేక్ దర్శనంలో శ్రీవారిని దర్శించుకున్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

పుట్టపర్తి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా 'స్పందన' నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలో కూడా 'స్పందన' నిర్వహిస్తారన్నారు.

7 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

లేపాక్షి : స్థానిక దుర్గావీరభద్రస్వామి ఆలయంలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్ తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆదివారం విడుదల చేశారు.

ఓంకారేశ్వరంలో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు

బత్తలపల్లి : ఈ నెల 8వ తేదీ శివరాత్రి సందర్భంగా స్థానిక లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వర ఆలయంలో ఏర్పాట్లు చేసినట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త, ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జడ్పీటీసీ కోటి సుధ తెలిపారు. బత్తలపల్లిలో ఆదివారం వారు ఆలయ ప్రధాన ఆర్చకులు కేశవస్వామితో కలిసి విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమాల వివరాలు వెల్లడించారు.

చెట్టు నరికివేత పై చర్యలు తీసుకోండి

కొత్తచెరువు : స్థానిక నెహ్రూనగర్‌లో ఎన్నో ఏళ్లుగా ఉంటున్న వేపచెట్టును విద్యుత్ శాఖ అధికారులు అనుమతులు లేకుండా నరికి వేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్త భాస్కర్‌నాయుడు కోరారు. ఆ చెట్టు విద్యుత్ లైన్‌కు అడ్డం వస్తున్నందని పంచాయతీ, ఫారెస్ట్ అధికారులతో అనుమతి తీసుకొని తొలగించాల్సిందని, అనుమతులు తీసుకోకుండా చెట్టును పూర్తిగా నరికి వేయడం చట్టరీత్యా నేరమన్నారు. పురాతన చెట్లను నరికి వేయడం ద్వారా పొల్యూషన్ అధికమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. చెట్లని నరికకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, కావున చెట్టు నరికిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎన్నికల బరిలో జైభారత్ పార్టీ

పుట్టపర్తి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల బరిలో జై భారత్ పార్టీ ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ బాలాజీనాయక్ తెలిపారు. పట్టణంలోని సాయిఆరామంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జేడీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. త్వరలోనే వ్యవస్థాపక అధ్యక్షుడు రాష్ట్ర వ్యాప్త పర్యటన చేస్తారన్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు ప్రేమ్, అర్జున్, శివశంకర్‌రెడ్డి, వేణుమాధవ్ పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి

రొద్దం : అంగన్వాడీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మండలంలోని పెద్దమంతూరు సెక్టార్ కమిటీ అధ్యక్షురాలు అలివేలమ్మ, కార్యదర్శి అనుష పేర్కొన్నారు. సెక్టార్ కమిటీ అధ్యక్ష, కార్యద ర్శులుగా వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. అంగన్వాడీల సమస్యలపై నిరంతరం పనిచేస్తామని రమేష్, ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు జయమ్మ, భావమ్మ తెలిపారు.



సెక్టార్ కమిటీ అధ్యక్షురాలు అలివేలమ్మ, కార్యదర్శి అనుష

ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్



ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరిన నాయకులు

సిఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు టిడిపిని వీడి వైసిపిలో చేరుతున్నారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తలమర్ల గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. తలమర్ల పంచాయతీలోని వివిధ గ్రామాల నుంచి 150 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలోకి చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు మరోమారు వైసిపిని గెలిపించాలని కోరారు. టిడిపి నాయకులు రమణ, ఆంజనేయులు, ఎస్.మాధవ, ఎస్.శ్రీరాములు, పోతన్న, మీసాల చిన్నయ్య, రామ్మోహన, దాసరి నాగేంద్ర, ఈడిగ సత్తి, కుంకు గంగాద్రి, మంగళ వెంకటేష్, మంగళ బాబు, రామచంద్ర, మురళీకృష్ణ, నరేష్, మంగళ శ్రీనివాసులు, చంద్రశేఖర్, మంగ్లీ, నాగప్ప, భాను, చలపతి, పెద్ద వెంకటేషతో పాటు 150 మంది కుటుంబాలు వైసిపిలో చేరగా ఎమ్మెల్యే కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పిటిసి గంగాదేవి, ఎంపీపీ గాయత్రీ, సర్పంచి నాగరత్నమ్మ, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, రమణ, చలపతి, మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, దాల్మిల్ సూరి, సాయిలీల పాల్గొన్నారు.

రాప్తాడు జన ప్రభంజనాన్ని చూపిద్దాం

మాజీ మంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి



చెన్నేకొత్తపల్లిలో పరిటాల సునీత సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

పెనుకొండ మండలంలోని కియా పరిశ్రమ వద్ద సోమవారం నిర్వహిస్తున్న 'రా.. కదలిరా..' సభలో రాప్తాడు జన ప్రభంజనాన్ని చూపిద్దామని మాజీ మంత్రి పరిటాల సునీత పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలిరా వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆమె నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. సునీత మాట్లాడుతూ ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో లోకేష్ పాదయాత్రకు అనూహ్య స్పందన వచ్చిందని, అంతకుమించి 'రా.. కదలిరా..' సభను విజయవంతం చేద్దామన్నారు. సిఎం జగన్ అధికారులు, పోలీసులను అడ్డం పెట్టుకొని జనాన్ని బలవంతంగా తరలించి సిద్ధం సభలు నిర్వహించుకుని గొప్పలకు పోతున్నారని విమర్శించారు.

టిడిపిలో భారీగా చేరికలు

రామగిరి మండలం కుంటిమద్ది పంచాయతీ పరిధిలోని శేషంపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు చిదిగొండ్ల శివయ్య, చిత్ర గోపాల్, బన్నేల ప్రసాద్, చిదిగొండ్ల అనిల్, చెన్నేకొత్తపల్లి మండల బిజెపి మాజీ కన్వీనర్ జీలకర్ర కార్తీక్, తదితరులు టిడిపిలో చేరగా పరిటాల సునీత కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ వైసిపిలో కొందరి రాజ్యమే నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాప్తాడు నియోజకవర్గం అభివృద్ధి పరిటాల సునీతతోనే సాధ్యమని, అందుకే తాము టిడిపిలో చేరామని తెలిపారు.

'పురం'లో జాబ్‌మేళాకు విశేష స్పందన

హిందూపురం : పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 50 కంపెనీలకు పైగా ప్రతినిధులు హాజరయ్యారు. 8వేల మంది ఇంటర్వ్యూలకు రిజిస్టర్ చేసుకోగా 2వేల మంది హాజరవగా ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 700 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి పరిపూర్ణానంద స్వామి ఆఫర్ లెటర్‌రు అందించి, శుభకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ బోర్డ్ సభ్యులు రమేష్‌రెడ్డి, చారుకీర్తి, సురవ రామాంజనేయులు, విద్యావేత్త రాంప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్, నాగరాజు, జాబ్ మేళా కోఆర్డినేటర్ శివ, రవితేజరెడ్డి, శివప్ప, నగేష్, జనార్ధన్, హర్ష, కార్తీక్, మనోజ్, మారుతి, సునీల్, సంతోష్ రెడ్డి, జయకృష్ణ, దత్తు, రవి, వినయ్, సాయి పాల్గొన్నారు.

ఘనంగా కుమారస్వామిరెడ్డి ఉద్యోగ విరమణ సభ

ప్రజాశక్తి-కదిరి టౌన్

జీవిత భీమా సంస్థలో 38 ఏళ్ల పాటు సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఆదివారం నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ ఫీల్డ్ వర్కర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బ్రాంచ్ సీనియర్ డెవలప్మెంట్ ఆఫీసర్ చంద్రయ్య అధ్యక్షతన పిళ్లా కుమారస్వామిరెడ్డిని సన్మానించారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, రాజశేఖర్ హాజరయ్యారు. కుమారస్వామిరెడ్డి వివిధ సామాజిక సంస్థల్లో అనేక కార్యకలాపాలు నిర్వహించి కదిరి ప్రాంత వాసుల మనసు చూరగొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో డివిజన్ ఉద్యోగుల సంఘం నాయకులు రఘునాథ్‌రెడ్డి, సిపిఎం నాయ కులు ఇంతియాజ్, సిపిఐ నాయకులు వేమయ్య యాదవ్, లాయర్ నరసింహులు, బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ నాయకులు డాక్టర్ మల్లెల భాస్కర్, ఏజెంట్ల సంఘం నాయకులు బయప్ప, డా.ఓబుల్‌రెడ్డి, కాల్వ మనోహర్, లాయర్ ప్రసాద్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, హనుమంతరెడ్డి, పెన్షనర్ల సంఘం, ఎల్ఐసి బ్రాంచ్ యూనియన్ నాయకులు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్, ఏజెంట్లు, సాహితీ స్రవంతి నాయకులు రాజశేఖర్, కవి శంకర నారాయణ, రాజు, చిన్నారావు పాల్గొన్నారు.



పిళ్లా కుమారస్వామిరెడ్డిని సన్మానిస్తున్న ప్రముఖులు

'రా.. కదలిరా..' సభకు సర్వం సిద్ధం

జయప్రదం చేయాలని టిడిపి నాయకుల పిలుపు



రా.. కదలిరా.. సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సవితమ్మ, టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ మండలంలోని కియా పరిశ్రమ ఎదురుగా సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రా.. కదలిరా..' సభకు సర్వం సిద్ధం చేశారు. టిడిపి అధినేత చంద్ర బాబు హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను ఆదివారం జిల్లా పార్టీ అధ్యక్షులు బి.కె.పార్థసారథి, మాజీ మంత్రులు పల్లె రఘునాథ్‌రెడ్డి, పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లాల ఎన్నికల పరిశీలకులు రవీంద్ర, పెనుకొండ పరిశీలకులు డాక్టర్ నరసింహారావు, ఎమ్మెల్యే అభ్యర్థులు సవితమ్మ, బండారు శ్రావణి, జిల్లా నాయకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేస్తామన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో భారీగా ప్రజలు తరలివస్తారని అందుకు తగ్గ ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. చంద్రబాబు ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. చంద్రబాబు హయాంలో ఉమ్మడి అనంతపురం జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేశారన్నారు. కియా పరిశ్రమ, గొల్లపల్లి రిజర్వాయర్ తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుదే అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌చౌదరి, మురళీధర్, ఆలం నరసానాయుడు, సామకోటి ఆదినారా యణ, దేవళ్ల మురళి, కొల్లకుంట అంజనప్ప, దగ్గుపాటి ప్రసాద్, శివబాల, సూర్యనారాయణ, శ్రీరాములు, త్రివేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-హిందూపురం



త్రివేణికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న దీపిక వేణురెడ్డి

పట్టణంలోని ముదిరెడ్డిపల్లికి చెందిన త్రివేణి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల శస్త్రచికిత్స చేయించు కుంది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక సాయంతో త్రివేణి సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంది. తద్వారా రూ. 1 లక్ష మంజూరు కోవడంతో ఆ చెక్కును ఆదివారం స్థానిక వైసిపి కార్యలయంలో త్రివేణికి దీపిక అందజేసింది. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఫిర్దోస్ ఖలీల్, కౌన్సిలర్లు జయప్ప, లక్ష్మీమహేష్‌గౌడ్, నాయకులు మార్కెట్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు. కదిరిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పెదిరెడ్డి నుంచి హిందూపురం రూరల్ మండలం కొటిపి గ్రామానికి చెందిన రాజమోహనకృష్ణ రూ. 6.3లక్షలు, కగ్గల్లు గ్రామానికి చెందిన సుధకర్‌రెడ్డి రూ. 65వేల చెక్కులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపి అభ్యర్థి శాంతమ్మ, వేణురెడ్డి, వలివేడు రాజారెడ్డి, ఎంపిపి పురుషోత్తంరెడ్డి, కొటిపి హనుమంతరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఫరూక్, బసిరెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, దిలీప్, షాకీర్, నవీన్ పాల్గొన్నారు.

వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం : మంత్రి

ప్రజాశక్తి-రొద్దం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. మంత్రి ఆదివారం మండలంలోని సానిపల్లి, చోలేమర్రి, నల్లూరు, చిన్నమంతూరు, చెరుకూరు, పెద్దమంతూరు, కలిపి పంచాయతీల్లో స్థానిక వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పంచాయతీ స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జగన్‌ను మరోమారు సిఎం చేసేందు కు కలిసికట్టుగా పని చేయాలన్నారు. సమావేశంలో ఎంపిపి చంద్రశేఖర్, సర్పంచులు పరమేష్, శివరాజు, మండల కన్వీనర్ తిమ్మయ్య, నాయకులు బి.నారాయణరెడ్డి, మారుతిరెడ్డి, పాల్గొన్నారు.

5న మంగళగిరిలో 'జయహో బిసి'

ప్రజాశక్తి-మడకశిర



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగప్ప

బిసిల భవిష్యత్తు టిడిపితోనే సాధ్యమని కుంచిటి ఒక్కలిగ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విఎం పాండురంగప్ప పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ కొల్లు రవీంద్ర అధ్యక్షతన మంగళగిరి నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న మైదానంలో 'జయహో బిసి' డిక్లరేషన్ రాష్ట్ర స్థాయి మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా పార్టీ అధినేత చంద్ర బాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో పాటు బిసి ప్రము ఖులు హాజరవుతారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కుంచిటి ఒక్కలిగ నాయకులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఆయనతో పాటు అశ్వద్ధామప్ప, ఆదినారాయణ, రామాంజనే యులు, టిడిపల్లి మంజునాథ్, రామప్ప, శ్రీరామప్ప ఉన్నారు.

పేదలకు కంటిచూపు ప్రసాదించడమే లక్ష్యం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

పేదలకు కంటిచూపు ప్రసాదించడమే లక్ష్యమని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, సెక్రటరీ జయరాం పేర్కొన్నారు. దాత అరుణాచలం సిల్క్‌హౌస్ యజమాని సిరిగెల భాస్కర్ సహకా రంతో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 105 మందికి వైద్య నిపుణులు కంటి పరీక్షలు నిర్వహించారు. 71 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. శిబిరంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సుకుమార్, జాయింట్ సెక్రటరీ నాగార్జున, కోశాధికారి బండి నాగేంద్ర, పిఆర్‌ఒ రాధాకృష్ణ, సభ్యులు డాక్టర్ సుబ్బారావు, చాంద్‌బాషా, పోలా ప్రభాకర్, వైకె.శ్రీనివాసులు, బండ్లపల్లి రంగనాథ్, ఒవి ప్రసాద్, ఖలీల్, సత్రశాల మల్లికార్జున, క్యాంప్ ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఆప్తమాలజీ టెక్నీషియన్ నాగరాజాచారి పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు ఏకలవ్య మోడల్ రెసిడెన్సీ ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ నాయక్

గిరిజన విద్యార్థుల కోసం జిల్లాలో కళాశాల ఏర్పాటుతో పాటు ఏకలవ్య మోడల్ రెసిడెన్సీ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎస్టీ రాష్ట్ర కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. స్థానిక సాయిఆరామం అతిథి గృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిఎం జగన్ గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేశార న్నారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రామ్, గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షు డు మల్లికార్జుననాయక్, రాయలసీమ జోన్ యోజన అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, సోమ్లానాయక్, శివానాయక్ పాల్గొన్నారు,

భారీగా కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని 44వ నెంబరు జాతీయ రహదారి కోడూరు తోపు వద్ద ఆదివారం స్పెషల్ పార్టీ పోలీసులు భారీగా కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు స్పెషల్ పార్టీ పోలీసులు కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు. వీరాపురం వైపు నుంచి వచ్చిన ఓ కారు వేగంగా వెళ్లిపోవడంతో పోలీసులు కోడూరు తోపు వరకూ ఛేజ్ చేసి పట్టుకున్నారు. 9 బాక్సుల(864) కర్నాటక మద్యం టెట్రా ప్యాకెట్లను గుర్తించారు. నిందితుడిని శెట్టిపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మద్యంతో పాటు కారును పోలీసులు సీజ్ చేశారు. మద్యం కొత్తచెరువుకు తరలిస్తున్నట్లు సమాచారం. నిందితుడి సెల్‌ఫోన్ కాల్ లిస్ట్‌లో పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి తరచూ కాల్స్ వెళ్లినట్లు ప్రజలు చర్చించుకోవడం విశేషం. గుట్టుచప్పుడు కాకుండా చిలమత్తూరు స్టేషన్ లో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కు తరలించారు.

అమరాపురం : మండలంలోని ఆలదపల్లి గ్రామ కర్నాటక ప్రాంత సరిహద్దు నుంచి గుడిబండ మండలం జమ్మలబండ గ్రామానికి ద్విచక్ర వాహనంపై కర్నాటక మద్యం తరలిస్తుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారని ఎస్ఐ జనార్దన్‌నాయుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యక్రమాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం కేసులో పట్టుబడిన నగేష్, కళారాజ్యనహళ్లి ఎవర్ గ్రీన్ లాడ్జ్ అండ్ బార్ రెస్టారెంట్ మేనేజర్ శివకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ఎమ్మెల్యే బాలకృష్ణను కలిసిన ప్యారూ సాబ్

ప్యారూసాబ్ కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా

హిందూపురం : వైసిపి ప్రభుత్వం తమ కుటుంబంపై కక్ష కట్టి తమ కుమారులపై అక్రమ కేసులు బనాయిస్తోందని టిడిపి సీనియర్ నాయకులు ప్యారూ సాబ్ ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసంలో కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. 'ఎవరూ భయపడొద్దు... నాతో పాటు టిడిపి అండగా ఉంటుంది'..అని భరోసా ఇచ్చారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం



పుట్టపర్తి రూరల్ : మండలంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ రమేష్‌బాబు తెలిపారు. ఈ నెల 3 నుంచి 31వ తేదీ వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ, ప్రవేశపరీక్ష ఏప్రిల్ 21వ తేదీ ఉంటుందన్నారు. 2023-24లో 5వ తరగతి చదివిన విద్యార్థులు అర్హులన్నారు. పరీక్ష రుసుము ఒసి, బిసి విద్యార్థులకు 150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 75 అన్నారు. విద్యార్థులు ఆధార్ కార్డ్, ఫొటో తీసుకొచ్చి పూర్తి చేసిన దరఖాస్తులను పాఠశాలలో నేరుగా అందజేయవచ్చన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

కరాటేలో 'పురం' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-హిందూపురం

గుంతకల్లులో కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో హిందూపురం విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు మాస్టర్ ఫైరోజ్ తెలిపారు. వివిధ పాఠశాలల నుంచి 50 మంది పాల్గొనగా అందులో ప్రథమస్థానం-24, ద్వితీయస్థానం-16, తృతీయ స్థానం-10 మంది సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంవిఐ రాజాబాబు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, ఎం.అల్తాఫ్‌పాషా సర్టిఫికెట్స్, మెమోంటోలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో పాల పొంగులు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మాఘ మాసం దీక్ష చేపట్టిన పలువురు మహిళలు నాల్గో ఆదివారం వివిధ ఆలయాల వద్ద భక్తిశ్రద్ధలతో పాల పొంగులు నిర్వహించారు. తెల్లవారుజామునే సమీప ఆలయాలకు వెళ్లి ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే కొత్త కుండలో నైవేద్యం తయారు చేసి, స్వామివారికి సమర్పించారు. మండలంలోని సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రం, సంగమేశ్వర క్షేత్రం, మాల్యవంతం, రామాపురం, కోడేకండ్లలోని వీరనారాయణస్వామి, డి.చెర్లోపల్లి సిద్దేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాల యం, ముష్టూరు, పోట్లమర్రి శివాలయం, గంటాపురం అప్పస్వామి దేవాలయంలో పాల పొంగులు నిర్వహించారు.

డాక్టర్‌గా మారిన టిడిపి అభ్యర్థి సునీల్‌కుమార్

మడకశిర : నియోజకవర్గ టిడిపి అభ్యర్థి సునీల్‌కుమార్ ఆదివారం స్థానిక వైద్య విధాన పరిషత్ లో డాక్టర్‌గా మారారు. కేకాతి సమీపంలో ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే ఎన్నికల ప్రచారంలో ఉన్న సునీల్‌కుమార్ హుటాహుటిన ఆసుపత్రికి చేరుకొని ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్స చేశారు. వృత్తి రీత్యా డాక్టర్ అయినా ఆయన ఆసుపత్రికి చేరుకొని డ్యూటీ డాక్టర్‌కు సహకరించి చికిత్స చేశారు.



వైద్యసేవలు అందిస్తున్న టిడిపి అభ్యర్థి సునీల్‌కుమార్

పల్స్‌పోలియో విజయవంతం



రొద్దంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-రొద్దం

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. పల్స్‌పోలియోలో భాగంగా ఆదివారం మంత్రి మండలంలోని సానిపల్లి గ్రామంలో చిన్నా రులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వశించారు. ఆయా పంచాయతీల్లో సర్పంచులు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సానిపల్లిలో సర్పంచి పరమేష్, భూచెర్ల సర్పంచి సోమి రెడ్డి, నల్లూరు ఉప సర్పంచి కల్లుకుంటలో పాల్గొన్నారు.

తలుపుల : మండలంలో 98.5 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారులు డాక్టర్ అఫ్తాఫ్, డాక్టర్ అశ్రిత తెలిపారు. బత్రేపల్లిలో ప్రత్యేకంగా మొబైల్ టీం ఏర్పాటుచేశారు. స్థానిక పిహెచ్‌సిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎంపిపి రఫీనాయక్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని డాక్టర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. కొత్తచెరువులో మేజర్ పంచాయతీ సర్పంచి రాధానాగరాజు, చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ గౌరీదేవి, సిహెచ్ఎన్ రామలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలో మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పలు పల్స్‌పోలియో కేంద్రాలను పరిశీలించారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 61 పల్స్‌పోలియో కేంద్రాల్లో సిబ్బందికి భోజనం, వాటర్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, సుదర్శనగుప్తా, రత్నశేఖర్‌రెడ్డి, సత్రసాల ప్రసన్నకుమార్, సోలిగాళ్ల వెంకటేశులు, కొండయ్య పాల్గొన్నారు.

మడకశిర : మండలంలోని నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో సిడబ్ల్యూసి మెంబర్ ఎన్.రఘు వీరారెడ్డి దంపతులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వారు మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు తప్పకుండా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో నీలకంఠా పురం ఆసుపత్రి వైద్యులు జయవర్ధన్, డాక్టర్ భార్గవి, సిబ్బంది పాల్గొన్నారు

గాండ్లపెంట : మండలంలో పల్స్‌పోలియో 98 శాతం విజయవంతమైందని వైద్యాధికారి మారుతిప్రసాద్ తెలిపారు. 2,979 మందికి గానూ 2,925 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు.

నల్లమాడ : మండలంలోని కొత్తపల్లితండాలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ కృష్ణా రెడ్డి, నల్లసింగయ్యగారిపల్లిలో డిప్యూటీ డిఎంహెచ్ఒ నివేదిత సందర్శించారు. రెడ్డిపల్లి పిహెచ్‌సి వైద్యా ధికారి గనేనాయక్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 0-5 ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించా రు. నల్లసింగయ్యగారిపల్లిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

రొద్దం : ప్రతి తల్లిదండ్రులు పిల్లలకు పోలియో చుక్కలు వేయించి పోలియో మహమ్మారిని తరిమికొట్టాలని పెనుకొండ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత సూచించారు. మండలంలోని కోగిర, భూచెర్ల గ్రామాల్లో ఆమె చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. కార్యక్రమంలో కంబాల పల్లి సర్పంచి మంజు, మాధవనాయుడు, టైలర్ ఆంజనేయులు పాల్గొన్నారు. జక్కలచెరువు గ్రామంలో నారాయణప్ప మృతి చెందగా సవిత ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెనుకొండ : మండలంలోని దుద్దేబండ పంచాయతీలో ఇస్లాపురం సింగిల్‌విండో అధ్యక్షుడు సల్లా సూర్యప్రకాష్‌రెడ్డి పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

లేపాక్షి : వైద్యాధికారి డాక్టర్ వెంకటచిరంజీవి ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని 98 శాతం విజయవంతం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ఆదినారాయణ, నాగేంద్ర, అధికారులు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : వైద్యాధికారిణి తేజశ్రీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని 95 శాతం విజయవంతం చేశారు.ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి వారి భవిష్యత్తు కాపాడి, సమాజం నుంచి పోలియో మహమ్మారిని తరిమేద్దామని ఎంపిపి బగ్గిరి త్రివేణి, జడ్పీటీసీ కోటి సుధ, మాజీ ఎంపిపి గుర్రం వనజ పిలుపునిచ్చారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ వై.వెంకటేశ్వరరావు పల్స్‌పోలియో కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ విక్రమ్, ధర్మవరం డిప్యూటీ వైద్యాధికారి చాటర్ సెల్వియా, డాక్టర్ చెన్నారెడ్డి, డాక్టర్ తిప్పయ్య, సూపర్వైజర్లు చంద్రశేఖర్రెడ్డి, గౌరమ్మ, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసతేజ్ పాల్గొన్నారు.

అమరాపురం : మండల వ్యాప్తంగా అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియా చుక్కలు వేశారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో మదనకుంట ఎంపీటీసీ హనుమంత రాయప్ప, సర్పంచి తిప్పేస్వామి, పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు, ఆలదపల్లి గ్రామంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

నల్లచెరువు : పల్స్‌పోలియో కార్యక్రమంలో ఎంపిడిఒ రాణెమ్మ, నల్లచెరువు సర్పంచి పంచ రత్నమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొని సచివాలయం-1 వద్ద పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. వైద్యాధికారులు డాక్టర్ కల్పన, డాక్టర్ అలేఖ్య, సిహెచ్ఒ రామచంద్రారెడ్డి 99 శాతం విజయవంతం చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు సుధాకర్, భారతి, రెడ్డమ్మ సూర్యనారా యణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నారాయణ, శంకర, చిన్నయ్య, భానుప్రకాష్ పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ జబివుల్లా, కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, వైద్యులు చిన్నారులకు చుక్కల మందు వేసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పోలియో రహిత సమాజమే లక్ష్యమని, దీని కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న 240 మందికి స్థానిక మంత్ర సోపు యజమాని నటరాజ్ కుమార్తె డాక్టర్ మేడా శ్రావ్య భోజన పాకెట్స్ అందించారు.

గుడిబండ : పిహెచ్‌సి వైద్యాధికారిణి సౌందర్య ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పెనుకొండలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సవితమ్మ



నీలకంఠాపురంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి దంపతులు



హిందూపురంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ



హిందూపురంలో పల్స్‌పోలియో సిబ్బందికి భోజన ప్యాకెట్లు అందిస్తున్న డాక్టర్ మేడా శ్రావ్య



నల్లమాడలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారులు

'రా.. కదలిరా..' సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కొత్తచెరువు

పెనుకొండ మండలంలోని కియా పరిశ్రమ ఎదురుగా సోమవారం మధ్యాహ్నం టిడిపి ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న 'రా.. కదలిరా..' బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ శ్రీనివాసులు కోరారు. కొత్తచెరువులో ఆదివారం వారు మాట్లాడుతూ చంద్రబాబు సభకు మండలంలోని టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు. సభకు వెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, పెద్దన్న, శంకర్ పాల్గొన్నారు.

'టిడిపి అభ్యర్థిని మార్చాల్సిందే'

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ టిడిపి అభ్యర్థి సునీల్‌కుమార్‌ను మార్చాలని ఆ పార్టీ జిల్లా సాధికార కన్వీనర్లు డిమాండ చేశారు. పట్టణంలోని బాలాజీనగర్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు భక్తర్, వీరశైవ సంఘం అధ్యక్షుడు దుర్గేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, టిఎన్‌టియుసి ఉపాధ్యక్షుడు బ్యాడిగెర మూర్తి మీడియా సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గ అభ్యర్థి సునీల్‌కుమార్‌ను మార్చకపోతే పార్టీకి రాజీనామా చేస్తామని స్పష్టం చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సాధికార కన్వీనర్లు

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని అరోమా వైద్యశాలలో ఆదివారం డాక్టర్ బొగ్గు సురేష్, డాక్టర్ ప్రభురాజ్, ఆధ్వర్యం లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు వివిధ రకాల జబ్బులకు ఆయుర్వేద వైద్యం అందించి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని చరిత్ర పరిశోధకులు, రచయిత మైనాస్వామి ప్రారంభించారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ గ్రహీత డాక్టర్ బొగ్గు సురేష్ మాట్లాడుతూ ఆది నుంచి నేటి వరకూ ఆయుర్వేద వైద్యానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పుట్టపర్తి అల్ట్రా విజన్ కంటి ఆసుపత్రి ద్వారా ఎంతోమంది ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు, ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. శిబిరంలో డాక్టర్ మధుకర్, కోనేటి వెంకటరమణ, దేవరాజు, లిఖిత, పుష్ప, గీత పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

ఘనంగా మదరసా రబ్బానియా వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలీముల్లా, తదితరులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని కాలేజీ రోడ్డులో జెండామాను వీధిలో ఉన్న మదరసా రబ్బానియాలో ఆదివారం కమిటీ సభ్యులు మదరసా వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మదరసా కార్యదర్శి హాజీ అత్తార్ మహబూబ్ బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మౌలానా కలీముల్లా హాజరై మాట్లాడుతూ మదరసాలో మంచి నడవడిక, మంచి అలవాట్లు నేర్పుతారని, ప్రతి విద్యార్థి తప్పక ఆచరించాలన్నారు. అనంతరం ప్రతిభ కనపరచిన వారికి బహుమతులు అందజేశారు. ప్రతి విద్యార్థికి దుస్తులు, విద్యార్థినులకు హిజాబ్ అందజేశారు. కార్యక్రమంలో మదరసా అధ్యక్షులు హాజీ జాఫర్ సాదిక్, కోశాధికారి అజీం ఖాన్, ఉప కార్యదర్శి అన్వర్ బాషా, సభ్యులు మహమ్మద్, ఉస్తాద్ హాఫీజ్ అహ్మద్ హుస్సేన్, మౌలిమా షాఫియ్ నాజ్, షాఫియా కౌసర్ పాల్గొన్నారు.